3న ఉత్సవ కమిటీ నియామకం

పెగడపల్లి, మార్చి 31: డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవ కమిటీలను ఈనెల 3న మండల కేంద్రంలో ఎన్నుకోనున్నట్లు మండల అంబేద్కర్ సంఘం నాయకులు పొనగంటి రాజయ్య, బత్తుల ప్రదీప్, ఆత్మకూరి చందు, బొమ్మెన స్వామి, తడగొండ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాలకు చెందిన కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

నవోదయలో సీటు సాధించిన న్యూ విజన్ స్కూల్ విద్యార్థి

కార్తీక్

ఇబ్రహీంపట్నం, మార్చి 31: వేములకుర్తి లోని న్యూ విజన్ పాఠశాలకు చెందిన కుమ్మరిపెల్లి కార్తీక్ ఐదో తరగతి చదువుతూ అదే పాఠశాలలో నవోదయ కోచింగ్ తీసుకున్నాడు. కాగా, ఆదివారం వెలువడిన ఫలితాల్లో కార్తీక్ నవోదయలో సీటు సాధించాడు. సీటు సాధించిన కార్తీక్‌ను తల్లిదండ్రులతో పాటు స్కూల్ ప్రిన్సిపాల్ గుమ్మల తిరుపతి, గ్రామస్తులు అభినందించారు.

కాంగ్రెస్‌లో వర్గపోరు

బోయినపల్లి, మార్చి 31: మండల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు, గ్రూప్ రాజకీయాలు బయటపడ్డాయి. ఆదివారం నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అధ్యక్షుడిని మా ర్చాలంటూ కొందరు నాయకులు పట్టుపట్టారు. మరికొందరు దీనిపై వివాదం అవసరం లేదని, మార్పు అవసరం లేదని పట్టుపట్టారు. దీంతో కార్యకర్తలు రెండు వర్గాలుగా వీడిపో యి, ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకున్నారు. దీంతో జిల్లా, మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బకాయిలు చెల్లించాలి

వీర్నపల్లి, మార్చి 31: ప్రభుత్వ పాఠ శాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, ఇతర బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్ర భుత్వ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన మండల సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు.

బస్ షెల్టర్ లేక.. ఎండలోనే

- తుప్పు పడుతున్న నిర్మాణ సామగ్రి
- పట్టించుకోని ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు
- తాత్కాలిక షెడ్లపై దృష్టి సారించాలని స్థానికుల వేడుకోలు

ఆర్టీసీ డిపోలోతుప్పు పడుతున్న నిర్మాణ సామగ్రి

మెట్‌పల్లి పాతబస్టాండ్ వద్ద మండుటెండలో వేచి ఉన్న ప్రయాణికులు, వృద్ధులు(ఫైల్)

మారుతీనగర్, మార్చి 31: రోజురోజుకు ఎండలు ముదురుతుండగా, మెట్‌పల్లి పట్టణంలో ప్రయాణికులకు నిలువ నీడలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టడంతో బస్టాప్‌ల వద్ద రద్దీ పెరిగింది. కానీ, ఆర్టీసీ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికులు మండటెండల్లో రోడ్లపైనే బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొన్నది. దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించని చందంగా మెట్‌పల్లి పట్టణంలో కూడళ్ల వద్ద బస్టాండ్ల నిర్మాణం మారింది. వెల్లుల్ల రోడ్డు, పాతబస్టాండ్, డిపో చౌరస్తాల వద్ద బస్‌షెడ్లను ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా.. అధికారుల నిర్లక్ష్యంతో పనులు క్షేత్రస్థాయిలో జరుగలేదు. దీంతో ఆర్టీసీ డిపోలోనే బస్‌షెడ్ల నిర్మాణ సామగ్రి తుప్పు పడుతున్నది. కాగా బస్టాప్‌ల వద్ద షెడ్ల నిర్మాణానికి స్థలం కోసం ఎదురు చూస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతుండగా, ఆర్టీసీ అధికారులు కనీసం తాత్కాలిక బస్ షెడ్లను కూడా ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెగడపల్లి, మార్చి 31: పెగడపల్లి మండల కేంద్రంతో పాటు ఏడుమోటలపల్లిలో స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం విండో సీఈవో తడ్కమడ్ల గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విండో సిబ్బంది హైమద్, అనిల్, ఆంజనేయులు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్, మార్చి 31: మండలంలోని లింగంపేట, నర్సింగాపూర్, మొరపల్లి, గొల్లపల్లి, జాబితాపూర్, బాలపల్లి, పొరండ్ల, హన్మాజీపేటలో జగిత్యాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సహకార సంఘం కార్యదర్శి వేణు, అదనపు కార్యదర్శి రాజేశ్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విండో సీఈవో గోపాల్‌రెడ్డి

పొరండ్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకార సంఘ కార్యదర్శులు, రైతులు

ప్రమాదకరంగా బోరింగ్

బతికపల్లి నుంచి లింగాపూర్‌కు వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న బోరింగ్

పెగడపల్లి, మార్చి 31: ఆర్‌అండ్‌బీ, గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. రోడ్డు పక్కన ఉన్న బోరింగ్‌ను తొలగించి, కొత్త రోడ్డు వేయాల్సిన ఆర్‌అండ్‌బీ శాఖ పట్టించుకోలేదు. పట్టించుకోవాల్సిన గ్రామ పంచాయతీ అధికారులు అటు పక్క కన్నెత్తి చూడడం లేదు. దీంతో బోరింగ్ దారి పక్కన ప్రమాదకర రీతిలోఉన్నది. పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామం నుంచి లింగాపూర్ గ్రామం వరకు ఆర్‌అండ్‌బీ శాఖ రోడ్డు నిర్మాణం చేపట్టింది. నిర్మాణంలో భాగంగా రోడ్డు పక్కనే ఉన్న బోరింగ్‌ను తొలగించాల్సి ఉండగా, దాన్ని అలాగే వదిలేసి పక్క నుంచే యథావిధిగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో అది ప్రమాదకరంగా మారింది.

రూ.లక్షా 33వేలు సీజ్

ధర్మపురి రూరల్, మార్చి 31: రాయపట్నంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద ఆదివారం ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి వద్ద రూ.లక్షా 33వేలను పట్టుకున్నారు. డబ్బుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి, అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

సీజ్ చేసిన నగదుతో పోలీస్ సిబ్బంది

దాతలకు సన్మానం

ధర్మపురి, మార్చి 31: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలను ఆదివారం పట్టణంలోని పాత టీటీడీ కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యుడు జక్కు రవీందర్, సభ్యులు, సిబ్బంది తదితరులున్నారు.

పెద్దాపూర్ మల్లన్న ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

బోనాల వైభవం..భక్త 'జన' శోభితం

- పెద్దాపూర్‌లో ఘనంగా మల్లన్న బోనాలు
- తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి తరలివచ్చిన భక్తులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 31: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో మల్లికార్జున స్వామి బోనాల జాతర ఆదివారం అత్యంత అంగరంగ వైభవంగా జరిగింది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 70 వేల మందికిపైగా మహిళలు శివసత్తుల పూనకాలు, పోతరాజుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. భక్తులు గొర్రెపిల్లలు, బెల్లాన్ని కానుకగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే సాగునీటికి కటకట

- జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

కథలాపూర్, మార్చి 31 : కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై నిర్లక్ష్యం చేయడం వల్లే సాగునీటికి కటకట ఏర్పడి పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మండిపడ్డారు. ఆదివారం కథలాపూర్ మండలం భూషణరావుపేట శివారులో సాగునీరందక ఎండిపోయిన వరి పొలాలను ఆమె పరిశీలించి రైతులను ఓదార్చారు. కథలాపూర్ శివారులో ఎస్సారెస్పీ వరదకాలువలో అడుగంటిన నీటిని పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం, ఎస్సారెస్పీ ఆయకట్టును ఎడారిలా మార్చిందని ధ్వజమెత్తారు. నీటిని ఎత్తిపోసి కష్టకాలంలో పంటలకు నీరు ఇవ్వాలనే సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించాలనే ధ్యాస రాష్ట్రంలోని ఏ ఒక్క మంత్రి, అధికార పార్టీ ఎమ్మెల్యేకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రకృతి తెచ్చిన కరువు కంటే.. పాలకులు అవగాహన రాహిత్యం వల్లనే పంటలకు నీరందని దుస్థితి నెలకొందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరదకాలువ ఎప్పుడూ నీటితో కళకళలాడడంతో సాగు విస్తీర్ణం పెరిగి రైతులు సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్ఎస్ నాయకులు వర్ధినేని నాగేశ్వర్‌రావు, కల్లెడ శంకర్, నాంపెల్లి లింబాద్రి, చెల్లపెల్లి అంజయ్య, ఏజీబీ మహేందర్, లోక శశిధర్ రెడ్డి, ఎండీ రఫీ, సోమ దేవేందర్‌రెడ్డి, బద్దం మహేందర్‌రెడ్డి, గంగం గంగారెడ్డి, కొత్తపెల్లి శ్రీనివాస్, తీట్ల శంకర్, ముస్కు శ్రీనివాస్, ప్రిన్స్‌రెడ్డి, నల్ల గంగాధర్, మేడిపెల్లి ఆదిరెడ్డి, కోలి నరేందర్ రెడ్డి, ఎంజీ రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భూషణరావుపేట శివారులో ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వసంత, బీఆర్ఎస్ నాయకులు

ఫేస్‌బుక్ మిత్రుల ఔదార్యం

- అగ్ని ప్రమాద బాధితుడికి రూ.1.22 లక్షల ఆర్థిక సాయం

ఫేస్‌బుక్ మిత్రులు జమ చేసిన నగదు పత్రాలను చూపుతున్న పసుపులేటి కృష్ణమూర్తి కుటుంబసభ్యులు

ధర్మపురి, మార్చి 31 : అద్దె ఇంట్లో ఉంటూ కిరాణం నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఓ వ్యక్తిని విధి అగ్ని ప్రమాద రూపంలో మంచానికే పరిమితం చేయగా, ఆ బాధితుడికి ఫేస్‌బుక్ మిత్రులు అండగా నిలిచారు. రూ.1.22 లక్షల ఆర్థిక సాయం అందించారు. వివరాలిలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుట్టపర్తి జిల్లా కేంద్రానికి చెందిన పసుపులేటి కృష్ణమూర్తి భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఉపాధి కోసం ఇంటి సమీపంలో చిన్న రేకుల షెడ్డును అద్దెకు తీసుకొని కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. దురదృష్టవశాత్తు 2021లో కిరాణాషాపులో జరిగిన అగ్ని ప్రమాదంలో సామగ్రి పూర్తిగా దగ్ధం కాగా, కృష్ణమూర్తి సైతం 50 శాతం వరకు కాలిపోయాడు. వెన్నెముకకు తీవ్రగాయాలు కావడంతో కొంతకాలం మంచానికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబపోషణ, ఇంటి అద్దె కోసం తన భార్య సరిత ఇండ్లల్లో వంట పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ వస్తున్నది. వైద్య ఖర్చులు, పిల్లల చదువుల కోసం ఇబ్బందులు పడుతుండగా వీరి పరిస్థితిని అక్కడి మిత్రుల ద్వారా ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ తెలుసుకొని స్పందించాడు. కృష్ణమూర్తి కుటుంబానికి సాయం అందించాలని కోరుతూ కృష్ణమూర్తి ధీనస్థితిని వివరిస్తూ, భార్య సరిత బ్యాంకు ఖాతా వివరాలతో ఈనెల 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. దీనికి స్పందించిన తెలుగురాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు సరిత ఖాతాలో రూ.1.22 లక్షలు జమ చేశారు. ఈ డబ్బులను కృష్ణమూర్తికి వైద్యం చేయించడంతో పాటు ఇంటి అవసరాలకు వినియోగించుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ మిత్రులకు కృష్ణమూర్తి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విలేకరులమంటూ వసూళ్లు

- చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన ఐదుగురిపై కేసు
- ఒకరి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మార్చి 31: విలేకరులంటూ ఓ లారీని అడ్డగించి వసూళ్లకు పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. మార్చి 30న వేములవాడలోని వరలక్ష్మి రైస్‌మిల్లు నుంచి 600 వడ్ల బస్తాలతో సిద్దిపేటకు వెళ్తున్న లారీని ఐదుగురు (పొన్నం చంద్రమౌళి, దూస రాజేందర్, చౌటపల్లి వెంకటేశ్, ఆవునూరి ప్రశాంత్, నరేశ్) జిల్లెల్ల వరకు వెంబడించారు. తాము విలేకరులమని.. తమకు డబ్బులు ఇవ్వాలని.. లేదంటే సంబంధిత అధికారులకు చెప్పి కేసు నమోదు చేస్తామని బెదిరించారు. దీంతో వేములవాడలో ఉన్న రైస్‌మిల్లు యజమాని వెంటనే జిల్లెల్లకు చేరుకొని వారికి ₹20వేలు ఇచ్చి, తంగళ్లపల్లి ఠాణా లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు నమోదు చేశారు. పొన్నం చంద్రమౌళిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎ స్పీ తెలిపారు. వారి నుంచి ₹20వేలు, ద్వి చక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. పరారీలో ఉన్న మిగతా నలుగురు విలేకరులను త్వరలోనే పట్టుకున్నామన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితు ల్లో ఉపేక్షించే లేదని హెచ్చరించారు.


ఉద్యోగిని సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

ఉద్యోగ విరమణ పొందుతున్న వారికి సన్మానం

జగిత్యాల, మార్చి 31: ప్రభుత్వ ఉద్యోగంలో దశాబ్దాల పాటు సేవలందించిన 61 ఏళ్ల పెంపుతో ఆదివారం ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి తెలంగాణ పెన్షనర్ల సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తమ అసోసియేషన్ తరపున ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ పెన్షనర్ల సెంట్రల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ఉద్యోగ విరమణ పొందుతున్న 12 మందిని సన్మానించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం దాదాపుగా 200 మంది ఉద్యోగ విరమణ పొందుతున్నారన్నారు. రెవెన్యూ శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా 31 డిసెంబర్ 2024 వరకు 55 మంది తహసీల్దార్లు, పోలీసు శాఖలో 2024 మార్చి 31న 29 మంది పోలీసు అధికారులు రిటైర్మెంట్ కానున్నారని, రిటైర్మెంట్ అవుతున్న అధికారులకు, ఉద్యోగులకు రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో అండగా ఉంటామన్నారు.

ట్రెటా కార్యవర్గం ఎన్నిక

ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గసభ్యులు

కోరుట్ల, మార్చి 31: పట్టణంలోని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయీస్, టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా రవిశంకర్, గౌరవాధ్యక్షుడిగా కిషన్, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్‌రావు, ఆర్థిక కార్యదర్శిగా కాంతారావు, ఉపాధ్యక్షులుగా నర్సయ్య, వెంకటేశ్వర్లు, అదనపు కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, సహయ కార్యదర్శులుగా రాంచంద్రం, వాహిద్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్, నాగరాజు, అక్బర్ ఆలీ, మూర్తి, మురళి, ఆడిటర్లుగా రవీందర్, ఆంజనేయులు, ముఖ్య సలహదారుగా రుద్ర మాణిక్యం ఎన్నికైనట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

మంత్రికి ఆత్మీయ సన్మానం

మంత్రిని సన్మానిస్తున్న రాజేశ్వర్‌గౌడ్

మారుతీనగర్, మార్చి 31: ఆర్టీసీ, రోడ్డు రవాణా శాఖ, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సర్వాయి పాపన్న గీత కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ గౌడ్ తనయుడు అనిల్ దీప్‌గౌడ్‌తో కలిశారు. అనంతరం మంత్రిని సన్మానించారు. పలు సమస్యలను పరిష్కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

'జ్ఞానోదయ'లో వీడ్కోలు సంబురాలు

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మారుతీనగర్, మార్చి 31: మెట్‌పల్లిలోని జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాలలోని తృతీయ సంవత్సర విద్యార్థులు ఆదివారం వీడ్కోలు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులతో పాటు కళాశాల యాజమాన్యాన్ని విద్యార్థులు సత్కరించారు.

'మన ఊరు మన ఆత్మ గౌరవం' వేడుకలు

పల్లె వాతావరణంపై విద్యార్థినుల ప్రదర్శన

జగిత్యాల రూరల్, మార్చి 31: జగిత్యాలలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీ ఆధ్వర్యంలో మండలంలోని తాటిపల్లిలో 'మన ఊరు మన ఆత్మ గౌరవం' పేరిట పల్లెదనం ప్రతిబింబించేలా ఆదివారం వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రైతు గొప్పదనం, తల్లిదండ్రులకు పిల్లలపై ఉన్న ప్రేమ నాటకం, పల్లె వాతావరణం, ప్రకృతి అందాలు, తదితర ప్రదర్శనలు అలరించాయి. వేడుకల్లో జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీ డైరెక్టర్ హరిచరణ్‌రావు, పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రావు, రజిత, అజిత, మౌనిక, ఎంపీటీసీ శ్రీనివాస్, ఆంజనేయులు, ప్రశాంత్, రవి, సత్యం, అబ్దుల్లా, విద్యార్థులు తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిపై ఒకరు.. అనారోగ్యంతో మరొకరు ఆత్మహత్య

మల్లాపూర్, మార్చి 31: మద్యానికి బానిసై ఒకరు, అనారోగ్యంతో మరొకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన నల్లూరి గంగాధర్(34) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లోని దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, మండలంలోని రేగుంట గ్రామానికి చెందిన నేరేళ్ల రాజిరెడ్డి(55) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు దవాఖానలు తిరిగినా ఆరోగ్యం మెరుగుపడలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై, గ్రామంలోని ఓ మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతురాలి భార్య ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రేపు అవిశ్వాస పరీక్ష

మల్యాల, మార్చి 31: మల్యాల మండల ప్రజాపరిషత్ కార్యాలయ అధ్యక్షురాలు (ఎంపీపీ) మిట్టపల్లి విమలపై తాము విశ్వాసం కోల్పోయామని పలువురు ఎంపీటీసీలు ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ క్రమంలో జగిత్యాల ఆర్డీవో పులి మధుసూదన్ నేతృత్వంలో మల్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఏప్రిల్ 2న అవిశ్వాస బలపరీక్షను నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎంపీటీసీలందరికీ ఎంపీడీవో స్వాతి నేతృత్వంలో నోటీసులను సైతం జారీ చేశారు. మంగళవారం జరిగే బలపరీక్షలో అవిశ్వాసం నెగ్గుతుందా? వీగిపోతుందా? అనేది తెలియనున్నది.